నాలుగో యూనిట్


# 15. వృథాచేయం

కింది చిత్రం చూడండి.



## ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రం చూడండి. ఏమి జరుగుతుందో చెప్పండి.
- పై చిత్రంలో లాగ జరగడం వల్ల ఏమవుతుంది?
- పై చిత్రంలోలా జరగకుండా ఉండాలంటే మనం ఏం చేయాలి?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.

సాధారణంగా డబ్బును పొదుపు చేయాలని మనకు తెలుసు. అట్లే నీటిని పొదుపుగా వాడాలని కూడా తెలుసు. మరి ఇంకా వేటిని పొదుపుగా వాడాలో కూడా తెలుసుకోవాలి. శైలజ, లక్ష్మి, రాధలు దేని గురించి మాట్లాడుకొన్నారు? ఏమి పొదుపు చేయాలని ప్రతిజ్ఞ చేశారో పాఠం చదవండి. తెలుసుకోండి.

ఆ రోజు ఆదివారం. శైలజ హడావిడిగా అన్నం తినేసి ఆడుకోవడానికి బయలుదేరింది. ఆమె చూపు గోడపై అతికించిన పెద్ద కాగితం మీద పడింది. ఏమిటా! అని ఆగి ఆసక్తిగా ఆ కాగితంవైపు అలా చూస్తూ ఉంది. అంతలోనే శైలజ స్నేహితులు లక్ష్మి, రాధ, సరిత, అనిరుధ్ వచ్చారు. "ఏమిటి శైలజా! అలా గోడవైపు కన్నార్పకుండా చూస్తున్నావు?" అంది లక్ష్మి. దానికి శైలజ "గోడమీద అతికించిన ఈ పెద్ద కాగితంలో ఏముందోనని చూస్తున్నాను" అంది. అందరూ కలిసి గోడ దగ్గరికి వెళ్ళి ఆ కాగితాన్ని చదివారు. అందులో ఇలా ఉంది.

## వినియోగదారులారా!... ఒక్క నిమిషం ఆలోచించండి!

**విద్యుత్తు వినియోగదారులకు విజ్ఞప్తి,**

విద్యుత్తు విలువ మీకు తెలుసు. దాన్ని ఎంత పొదుపుగా వాడుకుంటే అంత మంచిది. లేకపోతే భవిష్యత్తు అంధకారమౌతుంది.

**విద్యుత్ పొదుపు చేయడానికి సూచనలు**

- ఇంట్లో ఉన్నప్పుడు, పగటిపూట బల్బులు వేసుకోకండి.
- సి.ఎఫ్.ఎల్ బల్బులను మాత్రమే వాడండి.
- గాలి, వెలుతురు కోసం ఫ్యాను, ఎ.సి., కూలర్లకు బదులు కిటికీలు తెరిచి ఉంచుకోండి.
- ఇంటిలో నుంచి బయటకు బయలుదేరేముందు తప్పనిసరిగా విద్యుత్తు నిలిపి వేసి వెళ్ళండి.
- మాటిమాటికి రిఫ్రిజిరేటర్‌ను తెరుస్తూ ఉండకండి.
- గీజర్/హీటర్ లిఫ్టుల వంటి వాటి వినియోగాన్ని తగ్గించండి.
- ఎలక్ట్రిక్ కుక్కర్, మైక్రోవేవ్ ఓవెన్‌కి బదులు గ్యాస్‌పొయ్యిని వాడండి.
- ప్రతిరోజూ కాకుండా కొన్ని రోజులకు అవసరమైన ఆహారపదార్థాలను దినుసులను రుబ్బి పెట్టుకోండి.
- విద్యుత్ ఆదాచేసే సామర్థ్యమున్న (ఐదు నక్షత్రాలు) ఎలక్ట్రానిక్ పరికరాలను మాత్రమే వాడండి.

**"విద్యుత్తు పొదుపు – రేపటికి వెలుగు"**

రాష్ట్ర విద్యుత్‌శాఖ, ఆంధ్రప్రదేశ్



© SCERT not to be republished

"ఇందులో విద్యుత్తుకు సంబంధించిన వివరాలు ఉన్నాయి." అంది లక్ష్మి. "అవును విద్యుత్‌ను పొదుపు చేయమని అందులో రాసి ఉంది" చెప్పింది రాధ. పరిశీలనగా చూస్తూ "ఇందులో చాలా వివరాలు ఉన్నట్లున్నాయే" అన్నాడు అనిరుధ్.

ఇంతలోనే వాళ్ళు ఆడుకోవడానికి బయలుదేరుతున్న విషయం గుర్తుకు వచ్చి మైదానం వైపు దౌడుతీశారు. వీళ్ళు వెళ్తున్న దారిలో ఇలాంటివే పెద్దపెద్ద కాగితాలను గోడలకు అతికించి ఉండటం గమనిస్తూ మైదానానికి చేరుకున్నారు.


మిగతా పిల్లలకు గోడలకు అతికించిన పెద్దకాగితాల గురించి అందులోని విషయాల గురించి చెప్పారు. అంతలోనే అక్కడికి నర్మద వచ్చింది. వాళ్ళను చూసి "ఏమిటి పిల్లలూ! దేని గురించి మాట్లాడుతున్నారు?" అని అడిగింది. నర్మదను చూసి పిల్లలందరూ సంతోషంతో "అక్కయ్యా!" అంటూ ఆమె చుట్టూ గుమిగూడారు.

**శైలజ** : అక్కయ్యా! మేము ఆడుకోవడానికని ఇటువైపు వస్తుంటే గోడలపై పెద్ద కాగితాలను అతికించారు. దాని గురించి మేమందరం మాట్లాడుకుంటున్నాం.

**నర్మద** : అలాగా! అయితే అందులో ఏముంది?

**శైలజ** : విద్యుత్తును ఆదాచేయమని రాసి ఉంది. ఇంకా.. చాలా వివరాలు అందులో రాసి ఉన్నాయి.

**నర్మద** : అదా సంగతి! నేను కూడా ఈ వైపు వస్తుంటే దారిలో చూశాను. మన గ్రామంలో గోడల మీద అతికించారు. పిల్లలూ... దాన్ని పెద్ద కాగితం అనకూడదు. "పోస్టరు" అనాలి.



**రాధ** : ఓహో! 'పోస్టరు' అంటారా! మరి దాన్ని ఎందుకలా అతికించారు?

**నర్మద** : విద్యుత్తు తయారీ కంటే వినియోగం ఎక్కువగా ఉంది కాబట్టి సరిపోవడంలేదు, అందుకే విద్యుత్తును ఆదా చేసి సహకరించమని పోస్టర్ ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

**లక్ష్మి** : ఈ పోస్టర్‌ని ఎవరు అతికించారు అక్కయ్యా!

© SCERT not to be republished

నర్మద : విద్యుత్‌శాఖ వాళ్ళు అతికించారు. ఇలాంటి పోస్టర్లు మీరు ఎక్కడైనా చూశారా?

సరిత : అవును అక్కయ్యా! ఇంత పెద్ద పోస్టరు కాదు గానీ. కొంచెం చిన్నది మన ఊరి తిరునాళ్ళ సందర్భంగా చూశాము.

నర్మద : అందులో ఏముంది సరితా?

సరిత : ఫిబ్రవరి 2వ తేదినుండి 9వ తేదివరకు ఊళ్ళో తిరునాళ్ళు జరుగుతాయని, అందరూ రావాలని ఉంది.

నర్మద : ఇంకా ఎవరైనా ఇలాంటి పోస్టర్లు చూశారా?

అనిరుధ్ : నేను చూశాను అక్కయ్యా! పట్నం వెళ్ళినప్పుడు అక్కడ పెద్దపెద్ద సినిమా పోస్టర్లు అతికించారు.

నర్మద : ఓ! సినిమా పోస్టరా!

అనిరుధ్ : అవును, దానిమీద హీరో బొమ్మలు, ఇంకా వేరే బొమ్మలు కూడా ఉన్నాయి. దానిమీద సినిమా పేరు ఉంది. దర్శకుని పేరు, నిర్మాత పేరు, ఇతరుల పేర్లు రాసి ఉన్నాయి.

శైలజ : మన ఊళ్ళో చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించమని కూడా పోస్టరు అతికించారు అక్కయ్యా!

నర్మద : అంటే మీరు వేరువేరు పోస్టర్లు చూశారు కదా! పోస్టర్లు రకరకాలుగా ఉంటాయి. జాతర గురించి, సర్కస్ గురించి, రకరకాల ప్రదర్శనలకు సంబంధించినవి, కళాశాలల వివరాలు... ఇలా రకరకాల పోస్టర్లు ఉంటాయి.

లక్ష్మి : ఈ పోస్టర్లు ఎందుకు అతికిస్తారు?

నర్మద : సమాచారం అందరికీ తెలియజేయడంకోసం, ప్రజలను చైతన్యపరచడంకోసం కార్యాలయాల్లో, కూడళ్ళలో, జనసమ్మర్ధంగా ఉండే చోట పోస్టర్లను అతికిస్తారు. ఈ రోజు మీరు చూసిన పోస్టరు కూడా విద్యుత్తు ఆదా చేయడం కోసమని ప్రజలను చైతన్యపర్చడానికి ప్రదర్శించారు. ప్రభుత్వ శాఖలవారు ప్రజలను చైతన్యపరచడానికే కాక, ప్రభుత్వ కార్యక్రమాల గురించి తెలియజేయడానికి కూడా పోస్టర్లను ప్రదర్శిస్తారు. వ్యాపార సంస్థలవారైతే తమ సంస్థల గురించి, ఉత్పత్తుల గురించి ప్రచారం చేసుకోవడానికి పోస్టర్లను వాడుకుంటారు.

అనిరుధ్ : అంటే.. సినిమా, సర్కస్ గురించి అతికించేలాంటివి కదా!

నర్మద : అవును.

శైలజ : కానీ, మన బడి దగ్గర వేసిన పోస్టరు విద్యాపక్షోత్సవాల గురించి అందరికీ తెలియజేయడం కోసం అతికించారు కదా!

నర్మద : అవును! పిల్లలను బడిలో చేర్పించండని అతికించారు.

అనిరుధ్ : ఈ రోజు చూసిన పోస్టర్‌లో విద్యుత్తు అని రాసి ఉంది. అంటే ఏమిటి అక్కయ్యా?

© SCERT not to be republished

నర్మద : కరెంటునే విద్యుత్తు అంటారు. చాలా అవసరాలకు మనం విద్యుత్తును వినియోగిస్తున్నాం.



లక్ష్మి : నాకు తెలుసు అక్కయ్యా! ఇంట్లో బల్బు వెలగడానికి, టి.వి. నడవడానికి ఫ్యాన్ తిరగటానికి ఉపయోగిస్తాం కదా!

నర్మద : నువ్వు చెప్పింది నిజమే! వీటికే కాకుండా ఇంకా మన ఇళ్ళలో వేటికి ఉపయోగిస్తామో చెప్పండి.

సరిత : ఇంకా.. ఫ్రిజ్‌కి, ఇస్త్రీ పెట్టెకు, రైస్ కుక్కర్లకు, వాషింగ్ మిషన్‌కు కూడా వాడతాం.


నర్మద : వీటికే కాదు రైతులు పంటలు పండించడానికి, పరిశ్రమలు నడపడానికి, ఎలక్ట్రిక్ రైలు నడపడానికి బోలెడంత విద్యుత్తు అవసరం అవుతుంది.



రాధ : ఇన్ని ఉపయోగాలు ఉన్నాకూడా విద్యుత్తును ఎందుకు ఎక్కువగా నిలిపివేస్తున్నారు?

నర్మద : మన అవసరాలకు సరిపడా విద్యుత్తు ఉత్పత్తి కావడం లేదు. జలాశయాల్లో నీళ్ళు అడుగంటిపోయాయి. బొగ్గునిల్వలు తగ్గిపోయాయి. కాబట్టి విద్యుత్తు కోతలు విధిస్తున్నారు.

అనిరుధ్ : విద్యుత్తు కోతకు నీళ్ళకు ఏమిటి సంబంధం అక్కయ్యా?




నర్మద : విద్యుత్తు ఉత్పత్తికి నీటిని వినియోగిస్తారు. జలాశయాల్లో నీళ్ళను నిలవ చేసి, ఆ నీటిని గేట్ల ద్వారా వదిలి టర్బయిన్‌లను తిప్పుతారు. టర్బయిన్ల ద్వారా యాంత్రికశక్తిని విద్యుచ్ఛక్తిగా మారుస్తారు. జలాశయాల్లో ఇందుకు సరిపడా నీరు లేదు కాబట్టి విద్యుత్తు తయారుకావడం లేదు.

శైలజ : మరీ! బొగ్గుకు, విద్యుత్తు కోతలకు సంబంధం ఏమిటి?







© SCERT not to be republished

**నర్మద** : మన రాష్ట్రంలో ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి బొగ్గు ద్వారానే జరుగుతుంది. దీన్నే థర్మల్ విద్యుత్ అంటారు. బొగ్గును మండించడం ద్వారా వెలువడే శక్తితో నీటిని ఆవిరిగా మార్చి, ఆ నీటి ఆవిరితో టర్బయిన్‌లను తిప్పి యాంత్రికశక్తిని విద్యుచ్ఛక్తిగా మారుస్తారు.

**లక్ష్మి** : విద్యుత్తు ఉత్పత్తి వెనక ఇంత కథ ఉందా, అక్కయ్యా!

**అనిరుధ్** : అయితే... ఈ విద్యుత్ కోతల వల్ల టి.వి. చూడలేకపోతున్నాం. చాలా ఇబ్బందిగా ఉంది అక్కా!

**శైలజ** : వీడికి ఎప్పుడూ టి.వి. గొడవే! పొద్దస్తమానం టి.వి. చూస్తూనే ఉంటాడు.

**నర్మద** : ఈ కోతలనుంచి బయటపడాలంటే మనం కూడా విద్యుత్తును ఆదా చేయాలి.

**సరిత** : ఆదా చేయడమా? అదెలా!

**నర్మద** : మన ఇళ్ళలో అనవసరంగా విద్యుత్తును ఉపయోగిస్తూ ఉంటాం. అలాంటివి తగ్గిస్తే ఆదా అవుతుంది. ఉదా॥ అవసరం లేకున్నా ఫ్యాన్ వేయడం, ఫ్రిజ్ డోర్‌ను మాటి మాటికి తీయడం, ఇంట్లో ఎక్కువ బల్బులు వాడడం, అనవసరంగా బల్బులను వెలిగించడం, పగటిపూట బల్బులను వెలిగించడం వల్ల విద్యుత్తును వృథా చేస్తున్నాం.

**శైలజ** : అవును... పగటిపూట కూడా మా ఇంట్లో బల్బులు వెలుగుతూనే ఉంటాయి.

**అనిరుధ్** : మా ఇంట్లో కూడా రోజంతా టి.వి పనిచేస్తుంది. హాల్లో ఎప్పుడూ ఫ్యాన్ తిరుగుతూ ఉంటుంది.

**నర్మద** : చూశారా! ఇవన్నీ విద్యుత్తును అనవసరంగా వృథా చేయడమే. మీకోవిషయం చెప్పనా! ఇవన్నీ తగ్గిస్తే మీరు కూడా విద్యుత్తును ఉత్పత్తి చేసినట్లే! అందుకే విద్యుత్తును వినియోగించే ముందు ఒక్క నిమిషం ఆలోచించండి!



**పిల్లలందరూ** : అలాగే అక్కయ్యా! ఈ రోజు నుండి మేమందరం మా ఇళ్ళల్లో అనవసరంగా విద్యుత్తును వృథా చేయం అని ప్రతిజ్ఞ చేస్తున్నాం.

అని పిల్లలందరూ నర్మద అక్కయ్య దగ్గర నుండి వెళ్ళి ఆటల్లో నిమగ్నమయ్యారు.

© SCERT not to be republished

# ఇవి చేయండి

## I వినడం, ఆలోచించి చెప్పడం



అ) పోస్టర్లను జన సమ్మర్ధంగా ఉన్న ప్రాంతాల్లో అతికిస్తారు. ఎందుకో చెప్పండి.

ఆ) మీ ఇంట్లో వేటికి విద్యుచ్ఛక్తిని వాడతారు? వీటిలో దేనికి విద్యుత్తు వినియోగం ఎక్కువగా అవసరం ఉంది?

ఇ) గృహావసరాలతోపాటు మీ గ్రామంలో ఇంకా ఏ ఏ కార్యక్రమాలకు విద్యుచ్ఛక్తిని వాడుతారు? దీని వల్ల ఏం జరుగుతుంది?

ఈ) మీ గ్రామంలో/వీథిలో విద్యుత్తును అవసరం మేరకే వినియోగిస్తున్నారా? లేక వృథాగా వినియోగిస్తున్నారా? ఎలాగో చెప్పండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) కింది పోస్టరును చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

### గ్రామ ప్రజలారా! జాగ్రత్త పడండి! నీటిని పొదుపుగా వాడండి!

గ్రామ ప్రజలకు విజ్ఞప్తి

నీటి వృథాను అరికట్టండి.

- నీరు మనకు ప్రాణాధారం.
- ప్రతి నీటి చుక్కా విలువైనదే!
- నీటిని పొదుపుగా వాడుకొందాం!
- మన వాడకం అవసరం మేరకు మాత్రమే నీటిని వినియోగిద్దాం.
- నీరు ఎక్కడైనా పంపుల ద్వారా, కుళాయిల ద్వారా వృథా అవుతుంటే వెంటనే మునిసిపాలిటి / పంచాయితీ వారికి తెలియజేయండి.
- కుళాయి వదిలేసి పనులు చేయకండి. బకెట్‌లో పట్టుకొని నీటిని వాడండి.
- వాడుకొన్న నీటిని మొక్కలకు మళ్ళించండి.
- వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడుగుంత ద్వారా భూగర్భజలాలను వృద్ధి పరుద్దాం.

గ్రామ పంచాయతి
తిమ్మాపురం

1. పోస్టరు దేన్ని గురించి తెలియజేస్తోంది ?
2. పోస్టరును ఎందుకోసం అతికించారు ?
3. పోస్టరు ద్వారా నీవు తెలుసుకున్న మూడు ముఖ్యమైన విషయాలు ఏవి ?

© SCERT not to be republished

ఆ) పాఠం చదివి కింది వాక్యాలు ఎవరు ఎవరితో అన్నారో చెప్పండి.



1. "ఏమిటి! శైలజా! అలా గోడవైపు కన్నార్పకుండా చూస్తున్నావు?"
2. అదా సంగతి! నేను కూడా ఈ వైపు వస్తుంటే దారిలో చూశాను.
3. 'పోస్టరు' అంటారా ! మరి దాన్ని ఎందుకు అలా అతికించారు?
4. విద్యుత్తు కోతకు నీళ్ళకు ఏమిటి సంబంధం అక్కయ్యా?
5. అవును... పగటిపూట కూడా మా ఇంట్లో బల్బులు వెలుగుతూనే ఉంటాయి.

ఇ) పాఠంలోని పోస్టరును చదవండి, దాని ఆధారంగా మీ ఇంట్లో ఏమేమి అమలు చేస్తున్నారు? ఏమేమి అమలు చేయడం లేదో రాయండి.

| అమలు చేసేవి | అమలు చేయనివి |
|---|---|
| ................................ | ..................................... |

ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. పోస్టరు గమనించాక పిల్లలు ఏమని చర్చించుకొన్నారు?
2. పోస్టరును ఎందుకు అతికిస్తారు ?
3. విద్యుత్తు ఉత్పత్తి ఏ ఏ విధాలుగా జరుగుతుంది?
4. విద్యుత్తును ఏ ఏ అవసరాలకు వాడుకొంటున్నాం?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



అ) "విద్యుత్తు శక్తిని పొదుపు చేస్తే మీరు దాన్ని ఉత్పత్తి చేసినట్లే" దీన్ని సమర్థిస్తూ నాలుగు వాక్యాలు రాయండి.

ఆ) ఏదైనా అంశాన్ని గురించి ప్రచారం చేయాలన్నా ఇతరులకు తెలపాలన్నా పోస్టరును ఉపయోగిస్తారు కదా! అలాగే విద్యార్థులుగా మీరు ఏ ఏ అంశాల గురించి మీ వీధివాళ్ళకు/ ఊరివాళ్లకు పోస్టరు ద్వారా తెలియజేయాలనుకుంటున్నారు? ఎందుకు?

ఇ) విద్యుత్తు ఆదాచేసినట్లే మనం ఇంకా వేటిని ఆదాచేయాల్సిన అవసరం ఉంది? ఎందుకు?

ఈ) విద్యుచ్ఛక్తిని పొదుపుగా వాడాలని తెలుసుకున్నారు కదా! విద్యుత్తును పొదుపు చేయడానికి మీరేం చేస్తారో రాయండి.

© SCERT not to be republished

## IV పదజాలం



అ) విద్యుత్తుతో పనిచేసే సాధనాల పేర్లను రాయండి. వాటితో వాక్యాలు రాయండి.

ఆ) కింది పదాలకు సమాన అర్థాలు వచ్చేవి పాఠంలో ఉన్నాయి. వాటి ఆధారంగా సొంతవాక్యాలు రాయండి.

| పదం | సమాన అర్థం | సొంత వాక్యం |
|---|---|---|
| విన్నపం | | |
| జాతర | | |
| ఆదా | | |
| అనవసరంగా ఖర్చు | | |
| ఉత్పత్తి | | |

ఇ) కింది వాక్యాలను ఒకే పదంలో సూచించండి.

1. అనవసరంగా విద్యుత్తును వృథా చేయకుండుట......................
2. సమాచారాన్ని పెద్ద కాగితంమీద ప్రదర్శించేది......................
3. పిల్లలు ఆటలాడుకునే స్థలం ......................
4. దేవాలయం దగ్గర ప్రతి ఏటా జరిపే ఉత్సవం......................
5. ఎక్కువ నీరు నిలవ ఉంచే చోటు ......................

## V సృజనాత్మకత



అ) ఈ రోజుల్లో పిల్లలు బయటి చిరుతిళ్ళకు (fast food) అలవాటు పడ్డారు. కానీ దానివల్ల కలిగే అనారోగ్య సమస్యలు తెలియవు. కింద ఇచ్చిన పదాలు ఆధారంగా పాఠశాల అసెంబ్లీలో చెప్పడానికి ఒక సందేశాన్ని తయారు చేయండి.

బయటి చిరుతిళ్ళకు (fast food) కి దూరంగా ఉండండి.

- ఆరోగ్యానికి మంచిది కాదు
- అపరిశుభ్రమైనవి
- పోషకాలు లేనివి
- మసాలతో తయారైనవి
- ఖరీదైనవి
- తాజాగా ఉండవు

ఆ) విద్యుత్తు శాఖవారి పోస్టరును చూశారు కదా! అట్లాగే గ్రామంలో మొక్కలు నాటాలని సూచించేలా ఒక పోస్టరును తయారు చేయండి. ప్రదర్శించండి.


© SCERT not to be republished

## VI ప్రశంస



అ) మీరు బడికి వెళ్తూ ఉంటే ఊళ్లో వీధి దీపాలు వెలుగుతుండడం గమనించారు. విద్యుత్తు దుర్వినియోగం మీద తగిన చర్యలను తీసుకోవాలని సర్పంచికి విన్నవిస్తూ లేఖ రాయండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



**అ) కింది సంశ్లిష్ట వాక్యాలను చదవండి. రెండు వాక్యాలుగా రాయండి.**

1. పావురం వచ్చి, రాజు దగ్గర వాలింది.
2. పాము చెట్టు దిగి, పుట్టలోకి పోయింది.
3. చీమ ఆకుమీద చేరి, ఒడ్డుకు చేరింది.
4. అతడు అంచెలంచెలుగా ఎదిగి, గొప్ప స్థానాన్ని పొందాడు.
5. చేప చిక్కినట్టే చిక్కి, తప్పించుకొంది.

**ఆ) కింది సంయుక్త వాక్యాలను చదవండి. గీతగీసిన పదాలు ఉండేలా మరికొన్ని వాక్యాలను రాయండి.**

1. ఉరుములు, మెరుపులు రాలేదు, <u>అయినా</u> పెద్ద వర్షం కురిసింది.
2. అక్షరాలు స్పష్టంగా రాయాలి, <u>లేకపోతే</u> అర్థం కాదు.
3. శ్రీవేద బాగా పాటలు పాడింది, <u>కాబట్టి</u> పోటీలో బహుమతి వచ్చింది.
4. ఉదయాన్నే రైలు ఎక్కి వెళ్ళు <u>లేదా</u> ఇప్పుడు బస్సెక్కి వెళ్ళు.

### ప్రాజెక్టు పని

మీ గ్రామంలో ఏ ఏ అంశాల మీద పోస్టర్లు ఉన్నాయి. ఇవి వేటికి సంబంధించినవి? వాటిలోని వివరాలను తెలియజేయండి.

© SCERT not to be republished

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పోస్టర్ల గురించి విద్యుత్తు వినియోగం, పొదుపు గురించి చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. ఎవరు ఎవరితో ఏమన్నారో చెప్పగలను. | ఔను/కాదు |
| 3. | మొక్కలు నాటడంపై పోస్టరును తయారుచేసి ప్రదర్శించగలను. | ఔను/కాదు |
| 4. | నీటి పొదుపుపై పోస్టరును తయారు చేయగలను. | ఔను/కాదు |

ఇసుమంత ఆచరణ ఇరవైవేల టన్నుల వ్యర్థమైన మాటలతో సమానం.

- స్వామి వివేకానంద